క్లుప్తంగా

వీవోఏలకు కాలపరిమితి తొలగించాలి

భామిని: ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ వెలుగు వీవోఏలు మంగళవారం ఆందోళన చేసినట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీదేవి, కె.ధర్మరాజు తెలిపారు. మూడేళ్ల కాల పరిమితి జీవోను రద్దు చేయాలని, రాజీకీయ ఒత్తిడి తగ్గించి అక్రమ తొలగింపులు చేపట్టరాదని డిమాండ్ చేసినట్టు పేర్కొన్నారు. ఈ మేరకు డీఆర్‌డీఏ పీడీకి వినతిపత్రం ఇచ్చినట్టు తెలిపారు.

కోదండరామ ఆలయంలో ప్రత్యేక పూజలు



స్వామికి ఊంజల్ సేవ అందిస్తున్న అర్చకులు

పాలకొండ రూరల్: స్థానిక ముదునూరివారి వీధిలో కొలువైన శ్రీకోదండరామ ఆలయంలో మంగళవారం వైష్ణవ శ్రీకృష్ణ జన్మదిన వేడుకలను వైభవోపేతంగా చేపట్టారు. స్వామివారికి పంచామృతాభిషేకం చేయించారు. విశ్వక్షేణ పూజలు, పుణ్యావచనం అనంతరం ఊంజల్ సేవ, నక్షత్ర హారతి వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాల్లో అర్చకులు పీవీఎస్ రాంజీ, టి.శివకేశవరావు తదితరులు పాల్గొని స్వామికి దూప హారతులు అందించారు.

పాముకాటుతో గిరిజనుడికి అస్వస్థత

గుమ్మలక్ష్మీపురం: పాముకాటుకు గురైన మండలంలోని జేకేపాడు గ్రామానికి చెందిన కద్రక కడక్ అనే గిరిజనుడు అస్వస్థతకు గురయ్యాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మంగళవారం ఇంటి పెరటిలో ఉన్న కర్రలను తీస్తుండగా అందులో ఉన్న పాము కాటు వేసింది. ఈ క్రమంలో హుటాహుటిన భద్రగిరి సీహెచ్‌సీకి తరలించినట్టు తెలిపారు. ప్రస్తుతం కడక్ ఆరోగ్యం మెరుగ్గా ఉందని వైద్యులు తెలియజేశారన్నారు.

అంధుల ఆర్కెస్ట్రాకు వితరణ



వితరణ అందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు వెంకటనాయుడు

బలిజిపేట: స్వరమాధురి అంధుల ఆర్కెస్ట్రాకు రూ.12వేలను వితరణగా బలిజిపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటనాయుడు అందించారు. విశాఖకు చెందిన స్వరమాధురి అంధుల ఆర్కెస్ట్రా బృందం వారి విజ్ఞాపన మేర పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించి వారిని ప్రోత్సహించేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి సేకరించిన రూ.12వేలను బృందం సభ్యులకు అప్పగించినట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటనాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల పర్యవేక్షణ



నారన్నాయుడువలస ప్రాథమిక పాఠశాలను పర్యవేక్షిస్తున్న క్లస్టర్ హెచ్ఎం చిన్ని వెంకటరమణ

బలిజిపేట: మండలంలోని వంతరాం క్లస్టర్ పరిధిలో ఉన్న నారన్నాయుడువలస ప్రాథమిక పాఠశాలను క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు చిన్ని వెంకటరమణ మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. ఇంతవరకు పాఠ్యాంశాలు పూర్తయినవి లేనివి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వర్క్‌బుక్‌లను సరిచేస్తున్నారా? లేదా? అని పర్యవేక్షించారు. విద్యార్థులను పిలిచి వారితో పాఠ్యాంశాలు చదివించి వారి నైపుణ్యాలను గుర్తించారు. అదేవిధంగా పాఠశాల పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు మంచి విద్యను అందించి వారి నైపుణ్యాలను మరింత పెంచేందుకు కృషిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.



వీరఘట్టం: కోడిగుడ్లుతో కత్తులకవిటి హైస్కూల్ విద్యార్థులు ఏర్పాటు చేసిన ఓజోన్ ఫార్ములా ఓ3



పాలకొండ రూరల్: పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓజోన్ పరిరక్షణపై సూచనలు చేస్తున్న ప్రిన్సిపాల్ శ్యాంబాబు

● ఓజోన్ రక్షణకు విద్యార్థుల వినూత్న ఆలోచనలు



వీరఘట్టం : ప్రధాన రహదారిలో విద్యార్థులచే మానవహారం కట్టి ఓజోన్ ఆవశ్యకతను చెబుతున్న వీరఘట్టం హైస్కూల్ ఉపాధ్యాయులు

పర్యావరణ పరిరక్షణ కోసం ఓజోన్ పొరను రక్షించుకోవాల్సిన ఆవశ్యకత మనందరిపై ఉందని పలువురు పేర్కొన్నారు. ఓజోన్ దినోత్సవం సందర్భంగా పలు పాఠశాలల్లో విద్యార్థులు వివిధ కళాకృతులలో ఓజోన్ పొర రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు వినూత్న ఆలోచనలతో అబ్బురపరిచారు.

– సాక్షి నెట్‌వర్క్



గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓజోన్‌డే కార్యక్రమంలో విజేతలైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, సిబ్బంది



గుమ్మలక్ష్మీపురం కేజీబీవీలో ఓ3 ఆకృతిలో అలరించిన విద్యార్థులు

పంచాయతీలు ఆర్థిక పరిపుష్టిని సాధించాలి



కొత్తూరు ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో

గరుగుబిల్లి: పంచాయతీలు ఆర్థిక పుష్టిని సాధించేందుకు ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలు ఎంతో దోహదం చేస్తాయని డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు పేర్కొన్నారు. మండలంలోని కొత్తూరు గ్రామంలోని సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ (ఎస్‌డబ్ల్యూపీసీ) సెంటర్‌ను ఆయన మంగళవారం పరిశీలించి తయారైన వర్మీ కంపోస్టును విక్రయించేలా సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూపీసీ యూనిట్లలో తయారు చేసిన వర్మీ కంపోస్టును విక్రయించి పంచాయతీలు ఆర్థిక వనరులను పెంపొందించుకోవాలన్నారు. చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. వర్మీ కంపోస్టు ఎరువుతో నాణ్యమైన ఆహర ఉత్పత్తులను ఉత్పత్తి చేయవచ్చుననే విషయాన్ని ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలో వర్మీ కంపోస్టును వినియోగించి కూరగాయలు, ఆకుకూరలను సాగు చేసేలా ఉపాధ్యాయులకు వివరించాలన్నారు. ఆయనతో పాటు కార్యదర్శి తదితరులున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు



ద్రావణాలు, కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్టు మేనేజర్ మన్మోహన్

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయ విధానంలో అవసరమైన ద్రావణాలు, కషాయాల తయారీపై అవగాహన కల్పించడం జరుగుతుందని ఆర్‌వైఎస్ఎస్ ప్రాజెక్టు మేనేజర్ మన్మోహన్ అన్నారు. మండలంలోని తోటపల్లి జట్టు ఆశ్రమంలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎన్‌పీఎం షాప్ యజమానులతో ద్రావణాల తయారీపై మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, పురుగుల మందులు వినియోగించకుండా ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను సాగు చేయడం వల్ల మంచి ఆహారం, మంచి ఆరోగ్యం, మంచి ఆదాయం లభిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయానికి కావల్సిన జీవామృతాలు, కషాయాలు అందుబాటులో ఉంచుకొంటే ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టేందుకు రైతులు ముందుకు వస్తారన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐఎస్ఎస్ కన్సల్టెంట్ ప్రవీణ్‌కుమార్, ఎన్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ తదితరులున్నారు.

నల్లబ్యాడ్జీలతో విద్యుత్ ఉద్యోగుల నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తున్న విద్యుత్ శాఖ ఉద్యోగులు

పాలకొండ: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద జేఎల్ఎం గ్రేడ్ 2 ఉద్యోగులు మంగళవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. తమను రెగ్యులర్ చేయాలని నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సుదీర్ఘ కాలంగా విద్యుత్ శాఖలో సేవలు అందిస్తున్నామని యూనియన్ నాయకులు జీవరత్నం తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

అందరి సహకారంతోనే పర్యావరణ పరిరక్షణ



మాట్లాడుతున్న మన్యం సహజ ఉత్పత్తిదారుల కంపెనీ సీఈవో

సీతంపేట: పర్యావరణ పరిరక్షణలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని మన్యం సహజ ఉత్పత్తిదారుల కంపెనీ సీఈవో బి.శంకరరావు అన్నారు. మంగళవారం ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని దిగువసార గ్రామంలో గిరిజనులతో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఓజోన్ పొరను కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. వాసన్ సంస్థ ప్రతినిధి నర్సింగరావు, ఉదయ్‌కుమార్, పద్మ, గౌతమి పాల్గొన్నారు.

'బంగారు' తల్లులకు అభినందనలు

పార్వతీపురం టౌన్: ఖేలో ఇండియా క్రీడా పోటీల్లో భాగంగా ఈనెల 14వ తేదీన విశాఖపట్నంలోని ఆంధ్రాయూనివర్సిటీలో అస్మిత్ కిక్ బాక్సింగ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో పార్వతీపురంలోని డీవీఎంఎం పాఠశాలకు చెందిన బి.రుత్విక, సాత్వికలు ప్రతిభ చాటారు. పోటీల్లో వారిద్దరూ స్వర్ణ పతకాలు సాధించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.శ్రీధర్, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం డీవీఎం పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడితో పాటు, ఉపాధ్యాయులు బంగారు పతక విజేతలతో పాటు కోచ్ సుంకర అనిల్ కుమార్‌ను అభినందించారు.

దేవతలారా రారండి..



పట్టాభమ్మ తల్లికి ఘటాలతో వారాలు చేస్తున్న లుంబూరు గ్రామస్తులు

పాలకొండ రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాలకు ముందుగానే పల్లెల్లో గ్రామ దేవతలకు సంబరాలు చేసేందుకు పల్లెవాసులు వారాలు చేపట్టారు. మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి ఈ వేడుకలు కన్నుల పండువగా చేపట్టారు. దేవతలారా రారండి... మీ దీవెనలు అందించండి.. అంటూ మహిళలు తమ ఇష్ట దేవతలను స్మరిస్తూ పూజలు చేపట్టారు. గ్రామాల్లో, పొలిమేరల్లో ఉంటూ తమను కాపలికాస్తున్న అమ్మవార్లకు చల్లదనం చేసేందుకు ముర్రాటలు, ఘటాలను తలదాల్చి సామూహిక సంబరాలు చేపట్టారు. గ్రామాల్లో అన్ని వర్గాలకు చెందిన మహిళలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. మండల పరిధిలో లుంబూరు, కొండాపురం, బెజ్జి, అంపిలి తదితర గ్రామాల్లో వారాల సందడి అంబరాన్ని అంటింది. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సచివాలయ సిబ్బంది మెరుగైన సేవలందించాలి

మక్కువ: మండలంలోని వెంకటభైరిపురం సచివాలయాన్ని ఎంపీడీవో అర్జునరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడంతోపాటు, ప్రజలకు మెరుగైన సేవలందించాలని సిబ్బందికి సూచించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని సత్వరమే వాటిని పరిష్కరించేదిశగా చర్యలు చేపట్టాలని చెప్పారు. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమపథకాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. ప్రజల నుంచి సచివాలయ సిబ్బందిపై ఫిర్యాదులు రాకుండా పని చేయాలన్నారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన డీడీ



ఆహారాన్ని పరిశీలిస్తున్న డీడీ కృష్ణవేణి

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని వనిజ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.కృష్ణవేణి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని తరగతుల్లోనూ ఇంగ్లిష్, తెలుగు, హిందీ విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం వసతిగృహ స్టోర్ రూమ్, వంట గదిని పరిశీలించి విద్యార్థులకు పెడుతున్న పౌష్టికాహారం సక్రమంగా అందుతున్నది, లేనిది అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి మరుగుదొడ్లు, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉందా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారి విద్యా ప్రమాణాలు పెంచే విధంగా ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తీర్ణత శాతం పెంచాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆయనతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అల్లు రవిప్రసాద్, హెచ్‌డబ్ల్యూవో హెచ్.సత్యం, ఉపాధ్యాయులు ఉన్నారు.

శిథిలావస్థలో ఎంపీడీవో కార్యాలయం



శిథిలావస్థలో ఉన్న ఎంపీడీవో కార్యాలయం

జియ్యమ్మవలస రూరల్: మండల పరిషత్ కార్యాలయం భవనం కొన్నేళ్లుగా శిథిలావస్థలో ఉన్నప్పటికీ అధికారులుగాని, ప్రజాప్రతినిధులుగాని పట్టించుకోవడంలేదు. కార్యాలయంలోని ఎంపీడీవో గది, ఉపాధిహామీ గది, పరిపాలనా గది పెచ్చులూడటంతో ఇటీవల కురిసిన వర్షాలకు కారిపోయి వరదమయమై సంబంధిత రికార్డులు, కంప్యూటర్లు తడిసి పాడవుతున్నాయి. ఇదివరకు రెండుసార్లు మరమ్మతులకు నిధులు మంజూరు చేసి తూతూ మంత్రంగా పనులు జరిపినప్పటికీ మరల యథాస్థాయికి సమస్య చేరుకుంది. వర్షం కురిసిదంటే అధికారులు విధులు నిర్వర్తించడానికి భయపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇదిలా ఉండగా స్థానిక ఎంపీపీ బొంగు సురేష్ కూడా కనీసం పది రోజులకొకసారైనా కార్యాలయానికి వచ్చి ప్రజాసమస్యలపై చర్చించే పరిస్థితి కరువైంది. ఇప్పటికైనా ఎంపీడీవో కార్యాలయం మరమ్మతుల విషయంపై ఉన్నతాధికారులకు ఎంపీపీ తెలియజేయాలని పలువురు కోరుతున్నారు.

గురుకుల ఉపాధ్యాయులను కొనసాగించాలి



గురుకుల పాఠశాలల ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న పాలక రంజిత్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులను యథావిధిగా కొనసాగించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. గుమ్మలక్ష్మీపురంలో గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. లోకేష్ పాదయాత్ర చేసినప్పుడు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న ఉపాధ్యాయులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడేమో డీఎస్సీలో వీరి పోస్టులను చూపించడం అన్యాయమన్నారు. 2024 డిసెంబర్‌లో గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులు చేసిన సమ్మెకు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పందిస్తూ డీఎస్సీ ఎంపికలో వీరి పోస్టులకు ఎటువంటి ఇబ్బందులుండవని హామీ ఇస్తూ విరమింపజేశారని.. ఇప్పుడేమో డీఎస్సీ ఎంపికలో గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని వీరి పోస్టులను ఖాళీ చూపుతూ వెబ్ ఆప్షన్ ఇవ్వడం ఘోరమన్నారు. విద్యా శాఖ మంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ వీరి పోస్టులను యథాతథంగా కొనసాగించాలని లేకుంటే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మక దివాకర్, నాయకులు శ్రీను, వెంకట్, తిరుపతిరావు, కామేశ్వరరావు ఉన్నారు.

కోరం లేక మండల సమావేశం వాయిదా

సీతంపేట: ఎంపీటీసీ సభ్యుల కోరం లేక సీతంపేట మండల సర్వసభ్య సమావేశం మంగళవారం వాయిదా పడింది. మండలంలో 16 మంది ఎంపీటీసీ స్థానాలకుగాను కేవలం నలుగురు మాత్రమే హాజరయ్యారు. కనీసం మరో ఇద్దరు ఉంటే సభ జరిగి ఉండేది. సర్పంచ్‌లు, అధికారులు యాథావిధిగా వెలుగు కార్యాలయంలో సమావేశానికి ఉదయం 10.30 గంటలకు హాజరైనప్పటికీ కొంతమంది ఎంపీటీసీలు వ్యక్తిగత కారణాలతో రాలేకపోయారు. మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఎంపీటీసీలు వస్తారేమోనని మిగతా వారంతా వేచి చూశారు. చివరకు అధికారులు ఫోన్‌లు కూడా చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. సమావేశాన్ని వాయిదా వేయాలని సర్పంచ్‌లు, అప్పటికే వచ్చిన ఎంపీటీసీలు కోరడంతో ఎంపీపీ బి.ఆదినారాయణ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. బుధవారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు.

పరిశుభ్రతపై అవగాహన అవసరం

గరుగుబిల్లి:



హిక్కింవలస పాఠశాలలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజలలో పరిశుభ్రతపై అవగాహన కలిగి వుండాలని ప్రధానోపాధ్యాయులు కె.మురళీమోహన్, సహోపాధ్యాయుడు జి.చంద్రశేఖరరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని హిక్కింవలస పాఠశాలలో స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశుభ్రతపై గ్రామాలలో ర్యాలీలను నిర్వహించి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. చెత్త వ్యర్థాల పునర్వియోగంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమాలు ఆరోగ్యకరమైన జీవనానికి పునాది వేస్తుందన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తుందన్నారు. స్వచ్ఛ భారత్ లక్ష్యాలను సాధించేందుకు ఈ కార్యక్రమం ఎంతో సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీ బి.రామకృష్ణ తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐ నందు మిగులు సీట్ల భర్తీ నిమిత్తం నాల్గో విడత అడ్మిషన్ల కౌన్సెలింగ్‌ను ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 27వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా సమర్పించడంతో పాటు ఈ నెల 28వ తేదీన సమీపంలోని ఐటీఐల వద్దకు వెళ్లి వెరిఫికేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు. ఆ ప్రక్రియ పూర్తయిన విద్యార్థులకు మాత్రమే ఈ నెల 29వ తేదీన జరిగే అడ్మిషన్ల కౌన్సెలింగ్‌కు అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. తమ ఐటీఐ వద్ద రెండేళ్ల కోర్సులైన ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, ఒక ఏడాది కోర్సులైన వెల్డర్, కోపా మరియు డ్రస్‌మేకింగ్ ట్రేడులున్నాయని, వీటిలో మిగులు సీట్లకు ప్రవేశాలు జరుపనున్నట్టు తెలిపారు. వివరాలకు 6304086821, 9491134464 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

సీతంపేటలో..

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో నాల్గో విడత ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్టు ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీలోగా దరఖాస్తు చేసుకొని ఏదైనా ఐటీఐలో 28లోగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. 29న అడ్మిషన్లకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. వివరాలకు 75690 62449, 9491134464 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

పచ్చ చొక్కాలకే యూరియా ఇస్తారా..

- సామన్య రైతులకు ఇవ్వరా...
- మండల సమావేశంలో సభ్యుల ధ్వజం



యూరియా పంపిణీపై ఏవోను ప్రశ్నిస్తున్న ఎంపీపీ వెంకటరమణనాయుడు

వీరఘట్టం:

పచ్చ చొక్కాలకే యూరియా ఇస్తారా... సామన్య రైతులకు యూరియా ఇవ్వరా... అంటూ ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడుతో పాటు పలువురు సర్పంచ్‌లు ఏవో సౌజన్యను ప్రశ్నించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో యూరియా అంశంపై ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఏవోను ప్రశ్నించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎరువుల కోసం ఏనాడూ రైతులు రోడ్డెక్కలేదని, కూటమి ప్రభుత్వంలో ఒక్క యూరియా బస్తా కోసం పడరాని పాట్లు రైతులు పడుతుంటే సిఫార్సులు ఉన్న వారికే యూరియా ఇస్తున్నారని మండిపడ్డారు. అనంతరం ఏవో సౌజన్య మాట్లాడుతూ రైతులందరికీ యూరియా అందేలా చర్యలు చేపడతామన్నారు. అంతకు ముందు విద్యుత్ శాఖ అభివృద్ధి పనులపై ఏఈ కె.సోమేశ్వరరావు వివరించారు. వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో సాగునీటి సమస్య ఎక్కడా లేదని జలవనరుల శాఖ ఏఈ డి.వి.రమణ తెలిపారు. 16 వేలకు పైబడి డిజిటల్ రేషన్ కార్డులు అందుబాటులో ఉన్నాయని వీటిని కొద్ది రోజుల్లో కార్డుదారులకు అందజేస్తామని తహసీల్దార్ ఏఎస్ కామేశ్వరరావు తెలిపారు. ఇలా పలువురు అధికారులు తమ శాఖల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులపై సభకు వివరించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీలు విశ్వాసరాయి భార్గవ్, పత్రి విజయకుమారి, ఎంపీడీవో బి.వెంకటరమణ, పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.